ప్రజా సంబంధాలే గెలిపిస్తాయి

- ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటా
- అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్


బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ తన ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకుంటూ గెలుపే లక్ష్యంగా దూసుకెళుతున్నారు. ఈ నేపథ్యంలో తన విజయావకాశాలపై 'సాక్షి' కాలేరు వెంకటేష్ ఇంటర్వ్యూ.

సాక్షి: మీకే ఎందుకు ఓటు వేయాలి?

కాలేరు: ఐదేళ్ల క్రితం అంబర్‌పేట ప్రజలు నాపై నమ్మకం ఉంచి గెలిపించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి చేశాను. అందుకే మళ్లీ ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాను.

సాక్షి: ఐదేళ్లలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటి?ఇచ్చిన హామీలు నేరవేర్చారా?

కాలేరు: ఎన్నికల్లో గెలిచినప్పటినుంచి నిత్యం ప్రజల మధ్యే ఉన్నాను. 24 గంటలు అందుబాటులో ఉంటూ వారి కష్టా సుఖాల్లో పలుపంచుకున్నాను. మైనార్టీలకు హామీ ఇచ్చిన మేరకు శ్మశాన వాటికి సమస్యను తీర్చాను. ఇచ్చిన హామీలను దాదాపు నెరేర్చా.

సాక్షి: ప్రజలు మీ పట్ల ఏమేరకు సంతృప్తిగా ఉన్నారు?

కాలేరు: నియోజకవర్గంలో పేదల దహన సంస్కారాలకు వ్యక్తిగతంగా చేయూత నిచ్చాను. ఎందరో పేద బ్రాహ్మణులు, నీరు పేదలకు అండగా నిలబడ్డాను. కాలనీల్లో పార్కులు, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చొరవ తీసుకున్నా.

సాక్షి: అంబర్‌పేట్‌లో బీఆర్‌ఎస్ విజయావకాశాలు ఎలా ఉన్నాయి?

కాలేరు: చేసిన అభివృద్ధిని ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాను. ప్రజలంతా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ వైపే చూస్తున్నారు. ఇతర పార్టీల వైపు వారు ఆలోచన చేయడం లేదు. ప్రతి గల్లీలో నాకు నేరుగా ప్రజలతో సంబంధాలు ఉన్నాయి.

సాక్షి: మీ సమీప ప్రత్యర్థి పార్టీ ఎవరని భావిస్తున్నారు?

కాలేరు: నాకు ఎవరూ పోటీ లేరు. బీజేపీ, కాంగ్రెస్ రెండోస్థానం కోసం పోటీ పడుతున్నాయి.

ఒక్క చాన్స్ ప్లీజ్..

- ఆరు గ్యారంటీలపైనే నమ్మకం
- ప్రచారానికి అనూహ్య స్పందన
- కాంగ్రెస్ ఒక్కటే ప్రత్యామ్నాయం
- అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి


కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి

అంబర్‌పేట్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పేర్కొంటూ ఆ పార్టీ అంబర్‌పేట అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సుదీర్ఘ కాలం అనంతరం కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి: అంబర్‌పేట ప్రజలు మీకే ఎందుకు ఓటు వేయాలి?

రోహిణ్ రెడ్డి: కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీలతో అన్ని వర్గాల అభ్యున్నతి జరుగుతుంది. అందుకే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరుతున్నా.

సాక్షి: గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో పెద్దగా ప్రభావం చూపలేదు. మీరు ఏ విధంగా విజయం సాధిస్తానని భావిస్తున్నారు?

రోహిణ్ రెడ్డి: టికెట్ తీసుకుని నియోజకవర్గంలో అడుగు పెట్టగానే సొంత పార్టీ నేతలతో పాటు ప్రజలనుంచి అనూహ్య మద్దతు లభించింది. కాంగ్రెస్ నుంచి వెళ్లిన నేతలు సహితం తిరిగి రావడంతో మా బలం పెరిగింది. దీంతో గెలుపు దిశగా అడుగులు వేస్తున్నాం.

సాక్షి: ప్రచారంలో మీకు ఎలాంటి మద్దతు లభిస్తుంది?

రోహిణ్ రెడ్డి: ఎవరు ఊహించని విధంగా స్వచ్ఛందంగా అన్ని వర్గాల మద్దతు లభిస్తుంది. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.


సాక్షి: ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నారు?

రోహిణ్ రెడ్డి: ప్రత్యక్ష ఎన్నికలు ఎదుర్కోవడం మొదటిసారే అయినా గత 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. పెద్దలు రేవంత్‌రెడ్డి, వి.హనుమంతరావు మార్గదర్శకత్వంలో ఎన్నికల్లో పోరాడుతున్నా. పార్టీ కారయకర్తలే నా బలం.

సాక్షి: మీకు విజయావకాశాలు ఎలా ఉన్నాయి? మీ సమీప ప్రత్యర్థి ఎవరు అనుకుంటున్నారు?

రోహిణ్ రెడ్డి: ప్రజలు నాకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నాను. దాదాపు విజయం ఖాయం. నాకు సమీప ప్రత్యర్థులు ఎవరూ లేరు.

అంబర్‌పేట బీజేపీ అడ్డా


అంబర్‌పేట బీజేపీ అభ్యర్థి సి.కృష్ణయాదవ్

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీకి అడ్డా అని ఆ పార్టీ అభ్యర్థి సీ.కృష్ణ యాదవ్ అన్నారు. నియోజకవర్గంలో తిరిగి కాషాయ జెండా ఎగురవేసేందుకు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. శనివారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి: ప్రస్తుత ఎన్నికల్లో మీకు ఎందుకు ఓటు వేయాలి?

కృష్ణయాదవ్: అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న అభివృద్ధి మొత్తం బీజేపీ చేసిందే.. ప్రజలకు శాశ్వత ప్రతిపాదికన నియోజకవర్గ అభివృద్ధి బీజేపీ హయాంలోనే జరిగింది. నరేంద్ర, నేను, కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి తప్ప ఇతరులు చేసింది ఏమీలేదు.

సాక్షి: 20 ఏళ్ల తర్వాత ఎన్నికల బరిలో ఉన్నారు.. తేడా కనిపిస్తుందా?

కృష్ణయాదవ్: నేను క్రియశీల రాజకీయాలకు దూరంగా లేను. తాజాగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజా సేవకు దగ్గరవుతున్నా. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ విజేతలు. నాయకులు మారారే తప్ప ప్రజలు తమ పని తాము చేసుకుంటున్నారు.

సాక్షి: బీజేపీ అనుహ్యంగా మీకు అవకాశం కల్పించింది ఎలా భావిస్తున్నారు?

కృష్ణయాదవ్: ప్రస్తుత ఎన్నికలను బీజేపీ బీసీ సీఎం నినాదంతో ఎదుర్కోంటుంది. 50శాతం పైగా ఉన్న బీసీలకు రాజ్యాధికారం రావాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకు వచ్చి నా లాంటి వారికి అవకాశం కల్పించిందని భావిస్తున్నా.

సాక్షి: మీకు నియోజకవర్గ ప్రజలకు మధ్య దూరం పెరిగిందా?

కృష్ణయాదవ్: గతంలో నేను ఈ నియోజకవర్గానికి శాసనసభ్యునిగా, మంత్రిగా ప్రతినిథ్యం వహించాను. నా హయాంలో చేసిన అభివృద్ధే ఇప్పటికి ప్రజలకు ఉపయోగపడుతుంది. ప్రచారానికి వెళుతుంటే ప్రజల నుంచి వస్తున్న స్పందన నా సేవలు ఇంకా మరిచిపోలేదని తెలుస్తుంది.

సాక్షి: బీజేపీ పార్టీ శ్రేణుల సహకారం ఎలా ఉంది? మీ సమీప ప్రత్యర్థి ఎవరు అనుకుంటున్నారు?

కృష్ణయాదవ్: బీజేపీ పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధాంతాలు, నైతిక విలువలు ఉన్న సైనికులు వారి పూర్తి సహకారంతోనే నేను గెలువబోతున్నాను. బీజేపీకి అంబర్‌పేట అడ్డా మాకు పోటీలేదు.

కార్యకర్తలే పార్టీకి బలం

ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ దళిత మోర్చా నగర ప్రధాన కార్యదర్శి రామస్వామి తదితరులు

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని ముషీరాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్ అన్నారు. శనివారం రాత్రి అడిక్‌మెట్ డివిజన్‌లోని ఆజామాబాద్ హట్స్‌కు చెందిన బీజేపీ దళిత మోర్చా నగర ప్రధాన కార్యదర్శి రామస్వామితో పాటు అతడి అనుచరులు, మహిళలు పెద్ద సంఖ్యలో బీజేపీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఠా గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి ఎంతో మంది యువత, వివిధ పార్టీల నేతలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రామస్వామి మాట్లాడుతూ 30 ఏళ్లకుపైగా బీజేపీలో పని చేశానని అయినా తగిన గుర్తింపు దక్కలేదన్నారు. కార్యక్రమంలో మాధవ్, శ్యామ్‌సుందర్, బి.శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ అస్లాం, నేత శ్రీనివాస్, మహ్మద్ ఖదీర్, సాయిప్రసన్న, ప్రేమలతరెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, ఇంద్రసేనారెడ్డి, రోషన్‌బాలు తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ గంగపుత్ర సంఘం మద్దతు

ముషీరాబాద్: రాంనగర్ గంగపుత్రుల సంఘం బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తుందని ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్ అన్నారు. శనివారం ముషీరాబాద్ బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ముఠా గోపాల్‌కు రాంనగర్ గంగపుత్ర సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ముఠా గోపాల్‌ను ఎన్నికల్లో గెలిపించేందుకు సంఘానికి చెందిన 300 కుటుంబాలు అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు నాగేందర్, జగదీష్ చంద్రప్రసాద్, సందీప్ దయానంద్, కె.మాధవ్, పూన గోరఖ్‌నాథ్, శ్రీనివాస్, ఆకరుల అరుణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 26న ముషీరాబాద్ ప్రధాన రహదారిలోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సమ్మేళన కమిటీ నాయకులు జల్లా భిక్షపతి, బింగి నవీన్, రమేష్, నేత శ్రీనివాస్, పున్నా సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పద్మశాలి కులబంధువులందరూ హాజరుకావాలని కోరారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తాం


విజేతలను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

అంబర్‌పేట్: రాష్ట్ర స్థాయిలో ఇంటర్ స్కూల్ క్రీడా పోటీల్లో డీడీ కాలనీ అకడమిక్ హైట్స్ విద్యార్థులు సత్తా చాటారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్ రూపరెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డిలు విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ, పీఈటీలు విజయ్, జలంధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కాచిగూడ: న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని హైదరాబాద్ జిల్లా లీగల్ సరీ్వసెస్ అథారిటీ కార్యదర్శి, సిటీ సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి జి.కలార్చన అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాచిగూడలోని ఎంఎస్‌ఎస్ న్యాయ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు వాటినుంచి సులభంగా బయటపడవచ్చునన్నారు. పేదలు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ఎస్‌బి కాబ్రా, డాక్టర్ డీవీఎన్ ప్రదీప్, డాక్టర్ ఎండీ అదిల్, రబీంద్రనాథ్, వెంకటేశ్వర్ రావు, రీతా రాణీ, వందనా సాంబ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దమ్ముంటే కర్ణాటకకు రా


గాంధీనగర్ బహిరంగ సభలో మాట్లాడుతున్న డీకే శివకుమార్

- కర్ణాటక ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్
- బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే...
- కేసీఆర్‌ను శాశ్వతంగా ఫామ్ హౌస్‌కే పరిమితం చేయాలి..

కవాడిగూడ: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు దమ్ముంటే కర్ణాటక రాష్ట్రానికి వస్తే ఐదు గ్యారంటీల అమలును నిరూపిస్తానని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. శనివారం గాంధీనగర్ చౌరస్తాలో ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా భారీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీకే మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణ ప్రజలు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించి పదేళ్ల నియంత పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలను అమలు చేయడంలేదని తప్పుడు ప్రచారం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్ తన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ కేంద్ర ప్రభుత్వ చట్టాలకు మద్దతు ప్రకటిస్తుందని, కేసీఆర్, మోదీ ఒక్కటే అనే విషయాన్ని తెలంగాణ ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. రెండు సార్లు పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించిన అంజన్‌కుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపడతారన్నారు. మహేష్‌కుమార్ గౌడ్, నర్సయ్య, వాజీద్ హుస్సేన్, గుర్రం శంకర్, ప్రఫూల్ రాంరెడ్డి పాల్గొన్నారు.

కమలం గుర్తుకు ఓటు..అభివృద్ధికి చోటు


ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

చిక్కడపల్లి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు అన్నారు. శనివారం ఆయన గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, ఓబీసీ ఉమేష్, మహమూద్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఓబీసీ మోర్చా సమావేశం

కాచిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో ఈ నెల 26న ఆదివారం ఉదయం గోల్నాక పరేల్ గార్డెన్స్‌లో బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ తెలిపారు. శనివారం కాచిగూడ మహేంద్ర గార్డెన్స్‌లో సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముఠా గోపాల్‌కు మద్దతుగా దివ్యాంగుల ప్రచారం



చిక్కడపల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌ను గెలిపించాలని కోరుతూ దివ్యాంగులు శనివారం గాంధీనగర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. మల్లికార్జున్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో దాదాపు 4790 మంది దివ్యాంగులు ప్రచారంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. శబరీ చావ్లా, సైదులు, భాస్కర్, హనుమానాయక్, ధనమ్మ, వెంకట్ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న...


ప్రచారం నిర్వహిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్, ఎం.నర్సయ్య తదితరులు

అందరి వాడు అంజన్..

ముషీరాబాద్: ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అందరి వాడని స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించారని తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నర్సయ్య అన్నారు. శనివారం ఆయన డివిజన్‌లోని వైఎస్‌ఆర్ పార్క్, పార్సిగుట్ట, బాప్టిస్ట్ చర్చ్, రాంనగర్ రామాలయం, ఆదర్శ కాలనీ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. 2004 నుంచి ముషీరాబాద్ ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. పాత బస్తీకి చెందిన అయినా ముషీరాబాద్ ప్రాంతంలోనే తన రాజకీయ జీవితం కొనసాగిందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పోటీ పడలేని బీఆర్‌ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో మనోహర్‌సింగ్, నాగభూషణంగౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, నర్సింగ్, జైపాల్‌రెడ్డి, సుధాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్‌గా అభిషేక్‌రెడ్డి.


అభిషేక్‌రెడ్డి

ముషీరాబాద్: టీపీసీసీప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్‌గా మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య మనువడు అభిషేక్‌రెడ్డి నియమితులయ్యారు. పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేష్‌కుమార్‌గౌడ్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అసంతృప్తి కారణంగా పలు కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న అభిషేక్‌రెడ్డిని ఏఐసీసీ నాయకులు కలిసి బుజ్జగించారు. ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రచార బాధ్యతలను తీసుకుని కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేస్తానని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన లింగాల శ్రీకాంత్‌గౌడ్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లింగాల శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు సి.హెచ్.మహేందర్, శ్యామ్‌సుందర్, ఏ.శ్రీనివాస్‌గౌడ్ శనివారం న్యూ ఎమ్మెల్యే కౌటర్స్‌లోని అంజన్‌కుమార్‌యాదవ్ కార్యాలయంలో ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారు




సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో పౌర హక్కుల నేత పురుషోత్తం సంస్కరణ సభ సందర్భంగా ప్రజాస్వామ్యం, ఎన్నికలు, పౌర హక్కులు అంశంపై స్మారకోపాన్యాసం జరిగింది. పాశం యాదగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పౌర హక్కులు కాలరాసిందన్నారు. ప్రజలకు పోరాడే హక్కు కాదు కనీసం మాట్లాడే హక్కు కూడా లేకుండా చేశారని ఆరోపించారు. అనేక పోరాటాలు, బలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో మిగిలింది శూన్యమేనని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో మంచి పాలకులను ఎన్నుకునేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు.


తిరుమల శ్రీనివాస కల్యాణోత్సవం

రమణీయం.. శ్రీనివాసుడి కల్యాణం

కవాడిగూడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రచన టెలివిజన్, భక్తి టీవీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవ కార్యక్రమం శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తిరుమల శ్రీనివాస కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ (అవధూత దత్తపీఠ ఉత్తరాధిపతి), శ్రీ విద్యాశంకరభారతి మహాస్వామీజీ (పుష్పగిరి మహాసంస్థానం) అనుగ్రహ భాషణం చేశారు. అశేషభక్త జనం గోవింద నామస్మరణతో కోటి దీపోత్సవం ప్రాంగణం మారుమోగింది. అనంతరం స్వామివారిని కోటి దీపోత్సవ ప్రాంగణంలో పల్లకీపై ఊరేగించారు.



అభివృద్ధిని చూసి ఓటు వేయండి


మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న కాలేరు వెంకటేష్

అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్

నల్లకుంట: నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం ఆయన నల్లకుంట డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి, నియోజక వర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలతో నియోజక వర్గంలోని ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని, కోట్లాది రూపాయలతో నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. మహిళలు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. పాదయాత్రలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాక చందర్, రాగిఫణి బిల్డర్ ప్రవీణ్, భాస్కర్ గౌడ్, ధన్‌రాజ్ యాదవ్, కూర నరేందర్, యశ్వంత్ పాల్గొన్నారు.


ఓయూ జేఏసీ మద్దతు


మాట్లాడుతున్న డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ

నల్లకుంట: అంబర్‌పేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఓయూ జేఏసీ నేతలు పేర్కొన్నారు. శనివారం నల్లకుంట తిలక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ మాట్లాడుతూ అంబర్‌పేట నియోజక వర్గం నిరంతరం అభివృద్ధికి కాలేరు వెంకటేష్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు.

అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తా..

అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్ రెడ్డి


శివానంద్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్ రెడ్డి

నల్లకుంట: హస్తం గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన నల్లకుంట డివిజన్ పరిధిలోని శివానంద్ నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పార్టీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను వివరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులకు విముక్తి చిరుతల పార్టీ మద్దతు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులకు విముక్తి చిరుతల పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలకర శ్రీనివాస్ తెలిపారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ పార్టీ విఫలమైందన్నారు. పదేళ్ల పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ కులం పేరుతో రాజకీయం చేస్తుందని, ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలను మరోసారి మోసం చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు శివప్రసాద్, మచ్చా దేవేందర్, చెరిపల్లి ఆనంద్, శ్యామ్, కోటేశ్వర్‌రావు, వెంకటేష్‌యాదవ్, కోశాధికారి దానబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

అంజన్‌కుమార్‌కు బ్రాహ్మణ సేవా సమాఖ్య మద్దతు


మాట్లాడుతున్న అంజన్ కుమార్ యాదవ్

ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్‌కు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని హరిహర కళాక్షేత్రం కమ్యూనిటీహాల్‌లో బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే బ్రాహ్మణుల అభ్యున్నతికి పాటుపడతానని అన్ని విధాలా ఆదుకుంటానని తెలిపారు. దీనికి స్పందించిన సమాఖ్య సభ్యులు మద్దతు ప్రకటించడంతో పాటు ఇంటింటి ప్రచారాన్ని కూడా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సురేష్‌చంద్ర, సిఎల్ నర్సింహారావు, పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్, చంద్రమౌళి, అయ్యగారి రామకృష్ణ, వంగాల వెంకటేష్, జి.నిర్మలదేవి, సి.హెచ్.లలితకుమారి, ఆకేళ్ల అనురాధా, కరుణం సురేష్, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల మద్దతు ..

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌కు దివ్యాంగుల సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు దివ్యాంగుల సంఘాల జేఏసీ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.పర్వతాలు తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో దివ్యాంగుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అంజన్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అంజన్‌కుమార్‌యాదవ్ హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ దివ్యాంగులను పట్టించుకోలేదన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.